క్లుప్తంగా

తెలంగాణ తరహాలో సాగు సాయం ఇవ్వాలి

కడప సెవెన్‌రోడ్స్ : తెలంగాణ తరహాలో ఇక్కడి రైతులకు, కౌలుదారులకు ఎకరాకు రూ. 10 వేల సాగు సహాయం ఇవ్వాలని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎంవీ సుబ్బారెడ్డి సోమవారం జాయింట్ కలెక్టర్ గణేష్‌కు వినతిపత్రం సమర్పించారు. సాగు సాయాన్ని పెంచడంతోపాటు ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు 90 శాతం సబ్సిడీతో ఆర్బీకేల ద్వారా అందించాలన్నారు. కేరళ తరహాలో రుణ విమోచన చట్టాన్ని తెచ్చి రూ. 2 లక్షల వరకు రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు పెద్ద పుల్లయ్య, కట్టా యానాదయ్య, ఎం.ప్రసాద్, లక్ష్మినారాయణ, వెంకటరెడ్డి, గోశెట్టి రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

పాఠ్య పుస్తకాలు ఉచితంగా ఇవ్వాలి

కడప సెవెన్‌రోడ్స్ : ఇంటర్మీడియేట్ విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు ఉచితంగా ఇవ్వాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో కళాశాల విద్యార్థులు సోమవారం కలెక్టరేట్ ఎదుట నిరసన దీక్ష చేపట్టారు. ఎస్ఎఫ్ఐ మాజీ నాయకుడు మనోహర్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నాయక్, రాజేంద్రప్రసాద్‌లు మాట్లాడుతూ రాష్ట్ర పిలుపులో భాగంగా నిరసన దీక్ష చేపట్టామన్నారు. కళాశాలలు ప్రారంభమై రెండు నెలలు కావస్తున్నా పాఠ్య పుస్తకాలు లేక విద్యార్థులు చాలా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు గండి సునీల్‌కుమార్, వెంకటసుబ్బయ్య, వినయ్, రవి పాల్గొన్నారు.

క్రీడాకారులకు అభినందన

కడప స్పోర్ట్స్ : బెంగుళూరులో ఇటీవల నిర్వహించిన 5వ నేషనల్ తైక్వాండో చాంపియన్‌షిప్ పోటీల్లో కడప నగరానికి చెందిన క్రీడాకారులు పతకాలు సాధించారు. వీరిని సోమవారం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి టి.కె. అఫ్జల్‌ఖాన్ తన కార్యాలయంలో మెడల్స్ అందజేసి అభినందించారు. నగరంలోని మున్సిపల్ హైస్కూల్ ఉర్దూలో శిక్షకుడు జంషీర్ ఆధ్వర్యంలో శిక్షణ పొందిన అలకనంద, గితేష్, హబీబ్, జమీల్‌అహ్మద్‌లు గోల్డ్‌మెడల్స్ సాధించగా, షేక్ సాదిల్, నేహాల్‌ఖాన్‌లు రజతపతకాలు సాధించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ బండి బాబు, కోచ్ ఇర్ఫాన్, క్రీడాకారులు పాల్గొన్నారు.

క్లాప్ వాహనాల్లో వచ్చే చెత్తను తప్పనిసరిగా తూకం వేయాలి

కడప కార్పొరేషన్ : క్లాప్ వాహనాల ద్వారా తెచ్చే చెత్తను తప్పనిసరిగా తూకం వేయాలని మున్సిపల్ కమిషనర్ ప్రవీణ్‌చంద్ ఆదేశించారు. సోమవారం మార్నింగ్ విజిట్‌లో భాగంగా పాత కంపోస్టు యార్డు, ఉక్కాయపల్లె, పుట్లం పల్లి గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ పాయింట్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్లాస్టిక్, డ్రై వ్యర్థాలను తప్పక వేరు చేయాలన్నారు. కంపోస్టుయార్డు నందు ప్రతిరోజు ఐదు టన్నుల చెత్తను సేకరించి, కంపోస్టింగ్ చేయాలన్నారు. పుట్లంపల్లి గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్ వద్ద అక్కడి సిబ్బంది హాజరు పట్టికను పరిశీలించి, అక్కడ షెడ్ నిర్మించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సిబ్బంది పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ

కడప కోటిరెడ్డిసర్కిల్ : కెనరా బ్యాంకు ఆర్‌సెటీ సంస్థ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నామని సంస్థ డైరెక్టర్ నారాయణరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఫొటోగ్రఫీ, వీడియోగ్రఫీ, సెల్‌ఫోన్ రిపేర్, సర్వీసింగ్‌లో 30 రోజులపాటు, సీసీ టీవీ కెమెరా ఇన్‌స్టాలేషన్, సర్వీసింగ్‌లో 13 రోజులపాటు శిక్షణ ఇవ్వనున్నామన్నారు. 18–45 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన నిరుద్యోగ యువత ఇందుకు అర్హులన్నారు. ఆసక్తిగల వైఎస్సార్, అన్నమయ్య జిల్లాల నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, దూర ప్రాంతాల నుంచి వచ్చే వారికి ఉచిత వసతి, భోజన సౌకర్యం కల్పిస్తామన్నారు. వివరాలకు 94409 05478, 99856 06866 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

భద్రకాళి సమేతుడికి పల్లకీ సేవ

రాయచోటి టౌన్ : రాయచోటి భద్రకాళి సమేత వీరభద్రస్వామి పల్లకీలో ఊరేగారు. సోమవారం రాత్రి వీరభద్రస్వామి, భద్రకాళీ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తులను అలంకరించి భక్తులకు దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం ఉత్సవమూర్తులను అలంకరించి పల్లకీలో ఉంచి మాఢ వీధులలో ఊరేగించారు.

బైక్, ఆటో ఢీ

ఒంటిమిట్ట : మండల పరిధిలోని మృకుండాశ్రమం సమీపంలో ఉన్న శ్రీ సాయి కాశేశ్వర కళాశాల ఎదురుగా ఉన్న జాతీయ రహదారిపై సోమవారం బైక్, టాటా మ్యాక్స్ మినీ లగేజ్ ఆటో ఎదురెదురుగా ఢీ కొట్టుకోవడంతో బైక్ నడుపుతున్న వ్యక్తికి గాయాలయ్యాయి. పోలీసుల వివరాల మేరకు భాకరాపేట పంచాయతీ పెద్దపల్లి గ్రామానికి చెందిన వెంకట శివ ప్రసాద్ నాయుడు(30) బైక్‌పై ఒంటిమిట్ట నుంచి భాకరాపేటకు వెళుతుండగా ప్రొద్దుటూరు నుంచి రాజంపేట వైపు వెళుతున్న టాటా మ్యాక్స్ మినీ ఆటో ను ఢీ కొటి దీంతో బైక్ పై వెళుతున్న శివ ప్రసాద్‌కు గాయాలవ్వడంతో చికిత్స నిమిత్తం కడప రిమ్స్‌కు తరలించారు.

దొరల గోరీలను పరిరక్షించాలి

కమిషనర్‌తో అఖిలపక్ష కమిటీ నాయకులు



కమిషనర్ ప్రవీణ్‌చంద్‌కు వినతి పత్రం సమర్పిస్తున్న అఖిలపక్ష కమిటీ నాయకులు

కడప కార్పొరేషన్ : దొరల గోరీలు చారిత్రక వారసత్వ సంపదని, రోడ్డు వెడల్పు పేరిట వాటిని కూల్చివేయడం తగదని అఖిలపక్ష కమిటీ నాయకులు తెలిపారు. సోమవారం మున్సిపల్ కమిషనర్ ప్రవీణ్‌చంద్‌కు వారు వినతిపత్రం సమర్పించారు. అభివృద్ధికి తాము వ్యతిరేకం కాదని, అభివృద్ధి పేరిట కూల్చివేతల పర్వం కొనసాగిస్తే సహించేది లేదన్నారు. బలవంతుల జోలికి వెళ్లలేని యంత్రాంగం ఆక్రమణల పేరిట పేదల ఇళ్లు, అంగళ్లను నేల మట్టం చేస్తున్నార న్నారు. పరిరక్షించి భావితరాలకు వారసత్వంగా అందించాల్సిన దొరల గోరీలను కూల్చివేయడానికి సిద్ధమవడాన్ని తీవ్రంగా ఆక్షేపిస్తున్నట్లు తెలిపారు. దొరల గోరీలు (యూరోపియన్ సెమిట్రీ)కి 217 ఏళ్ల చరిత్ర ఉందని, 1800 సంవత్సరం నవంబర్ 1 తేది దత్తమండలాల ప్రిన్సిపల్ కలెక్టర్ థామస్ మన్రో బాధ్యతలు చేపట్టడంతో ఇక్కడ ఈస్ట్ ఇండియా కంపెనీ పాలన ప్రారంభమైందన్నారు. మరణించిన బ్రిటీషర్లను ఖననం చేసేందుకు 1807లో దొరల గోరీలు ఏర్పాటు చేశారని, బ్రిటీషు అధికారుల రికార్డు మేరకు ఇక్కడ 71 సమాధులు ఉన్నాయన్నారు. కడప సబ్‌కలెక్టర్‌గా పనిచేసిన మెక్‌డొనాల్డ్, సుప్రసిద్ధ ఇంగ్లీషు నవలా రచయిత విలియమ్ మెక్ పీస్ ఠాకరేకు చిన్నాన్న అయిన మద్రాసు సివిల్ సర్వీస్ అధికారి వెబ్ థాకరే సమాధులు ఇక్కడ ఉన్నాయన్నారు. సర్ అర్థర్ కాటన్ వంశీయుడైన చార్లెస్ స్టెంపుల్‌టన్ కాటన్ సమాధితోపాటు అనేక మంది సివిల్ సర్వీస్ అధికారులు, న్యాయమూర్తులు, మిలటరీ అధికారులు, ఇంజినీర్లు, బ్రిటీషు ఉన్నతోద్యోగుల సమాధులు ఉన్నాయన్నారు. వీరి వంశీయులు ఇంగ్లాండ్ నుంచి అప్పుడప్పుడు వీటిని సందర్శించి వెళ్తుంటారని వివరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకుడు హరిప్రసాద్, సీపీఎం నాయకుడు నారాయణరెడ్డి, సీపీఐ నగర కార్యదర్శి వెంకటశివ, సీపీఎం నగర కార్యదర్శి రామమోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రజా ఫిర్యాదులపై సత్వరం స్పందించాలి..

ప్రజల ఫిర్యాదులపై సత్వరం స్పందించి పరిష్కరించాలని మున్సిపల్ కమిషనర్ ప్రవీణ్‌చంద్ అన్నారు. సోమవారం కార్పొరేషన్ కార్యాలయంలోని వీసీ హాలులో నిర్వహించిన 'స్పందన' కార్యక్రమంలో ఆయన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఇందులో మొత్తం 45 అర్జీలు రాగా, అందులో ఇంజినీరింగ్ విభాగానికి సంబంధించి–11, టౌన్‌ప్లానింగ్–11, రెవెన్యూ విభాగం–4, హెల్త్ విభాగం–3, యూపీఏ విభాగం–1, హార్టికల్చర్–1, కడప తహసీల్దార్–5, ఏపీఎస్పీడీసీఎల్–1, హౌసింగ్–3, పోలీస్ –1 వచ్చాయి. వీటిని సకాలంలో పరిష్కరించాలని కమిషనర్ సంబంధిత అధికారులకు ఆదేశాలిచ్చారు.

అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలి



ఐసీడీఎస్ పీడీకి సమస్యలు తెలియజేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

కడప సెవెన్‌రోడ్స్ : అంగన్వాడీలు ఎదుర్కొంటున్న సమస్యలను సత్వరమే పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగసుబ్బారెడ్డి సోమవారం ఐసీడీఎస్ పీడీని కోరారు. ఒక సచివాలయానికి నాలుగు అంగన్వాడీ కేంద్రాలు, మరోసచివాలయానికి కేవలం ఒక అంగన్వాడీ కేంద్రం మాత్రమే ఏర్పాటు చేశారని, సెక్టార్ వారీగా ఏర్పాటు చేయాలని కోరారు. ప్రొద్దుటూరులోని అంగన్వాడీ కేంద్రాలను అర్బన్ ప్రాజెక్టులోకి విలీనం చేశాక వాటిని యదావిధిగా సెక్టార్స్ వారీగా కొనసాగించాలని, అలా కాకుండా వివిధ సెక్టార్లలోకి విలీనం చేయడం తగదన్నారు. ఇందువల్ల నివేదికలు సమర్పించడం కష్టతరమవుతుందన్నారు. ప్రొద్దుటూరు అర్బన్ ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారులు జీతాలు ఆపుతామని, డ్యూటీ సర్టిఫికెట్లు ఇవ్వమంటూ అంగన్వాడీ కార్యకర్తలను బెదిరిస్తున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు మద్దిలేటి, నాగరాజు, వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

'ప్రసాద్' పథకంలో పుష్పగిరిని అభివృద్ధి చేయాలి



డీఆర్వోకు వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

కడప కల్చరల్ : కేంద్ర ప్రభుత్వం దేశ వ్యాప్తంగా గల ప్రాచీన దేవాలయాల పునరుద్ధరణ, అభివృద్ధి కోసం ప్రవేశపెట్టిన ప్రసాద్ పథకంలో మన జిల్లాలోని పుష్పగిరిని కూడా చేర్చాలని ఇంటాక్ సభ్యుడు, న్యాయవాది సట్టి భారవి కోరారు. సోమవారం డీఆర్వో గంగాధర్‌గౌడ్‌ను కలిసి ఈ మేరకు వినతిపత్రం సమర్పించారు. పుష్పగిరి క్షేత్రానికి రాష్ట్ర వ్యాప్తంగా గొప్ప పేరుందని, ఎన్నో విశిష్ఠతలుగల ఈ ఆలయాన్ని రక్షించుకునే బాధ్యత అందరిపై ఉందన్నారు. ఇలాంటి విలక్షణమైన ఈ పుణ్యక్షేత్రాన్ని కేంద్ర ప్రభుత్వ ప్రసాద్ పథకంలోకి మార్చి దాని అభివృద్ధికి కృషి చేయాలన్నారు. అధికారులు ఈ పథకాన్ని వర్తించేలా మార్పుగలిగితే కేంద్ర ప్రభుత్వం నుంచి పుష్పగిరి అభివృద్ధికి రూ. 40 కోట్లు నిధులు మంజూరయ్యే అవకాశం ఉందన్నారు. ఆ పథకంలోని దేవాలయాల పర్యాటకం విభాగంలో దీన్ని చేర్చేందుకు కృషి చేయాలని కోరారు.

హాస్టల్ భవనానికి నిధులు కేటాయించాలి

కడప ఎడ్యుకేషన్ : కడప ఆర్ట్స్ కళాశాలలో ఉన్న అటాచ్‌మెంట్ హాస్టల్ భవనానికి రాష్ట్ర ప్రభుత్వం నిధులు కేటాయించాలని రాయలసీమ స్టూడెంట్ ఆర్గనైజేషన్ రాష్ట్ర అధ్యక్షులు జగన్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన సోమవారం కడపలో విలేకర్లతో మాట్లాడుతూ జిల్లాలో ఆర్ట్స్ కళాశాలకు ఘన చరిత్ర ఉందని.. ఇది రాయలసీమ ప్రాంతానికి అతి పురాతనమైన కళాశాల అన్నారు. ఈ కళాశాలలో ఎందరో చదువుకుని ఉన్నత స్థానాల్లో స్థిరపడ్డారన్నారు. అప్పట్లోనే కళాశాలలో చదివే పేద విద్యార్థుల కోసమని అటాచ్‌మెంట్ హాస్టల్ భవనం కూడా ఏర్పాటు చేశారన్నారు. ప్రస్తుతం ఆ భవనం శిథిలావస్థకు చేరుకుందన్నారు. ఆ భవనానికి నిధులు కేటాయించి బాగు చేస్తే పేద విద్యార్థులకు మేలు జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ఓ నాయకులు మదన్, సుబ్బు, నాగేంద్ర, గంగులయ్య తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సురక్ష విజయంలో వలంటీర్లు కీలకం



అర్హులకు ధృవీకరణ పత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే మేడా, జెడ్పీ చైర్మన్ ఆకేపాటి

ఒంటిమిట్ట : వలంటీర్ల కృషి వల్లే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన జగనన్న సురక్ష కార్యక్రమం ఇంతటి విజయాన్ని సాధించిందని రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్‌లో సర్పంచ్ కత్తి సుజాత, ఎంపీటీసీ చెంచుగార్ల సుప్రియ ఆధ్వర్యంలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. పాల్గొన్న రాజంపేట ఎమ్మెల్యే మేడా, జెడ్పీ చైర్మన్ ఆకేపాటి ఒంటిమిట్ట కోదండ రామాలయం అభివృద్ధిలో భాగంగా తొలగించిన ఒంటిమిట్ట మెయిన్ ఎంపీపీ పాఠశాలకు ప్రత్యామ్నాయంగా స్థానిక జెడ్పీహెచ్ఎస్‌లో టీటీడీ సహకారంతో దాదాపు రూ. 86 లక్షల వ్యయంతో నిర్మించిన నూతన మెయిన్ ఎంపీపీ పాఠశాల భవనాన్ని వారు ప్రారంభించారు. అనంతరం జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా అర్హులకు ధృవీకరణ పత్రాలను అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ అర్హులై ఉండి ధృవీకరణ పత్రాలు పొందడంలో సమస్యలు ఎదురుకొంటున్న వారికి జగనన్న సురక్షతో విముక్తి కలిగిందన్నారు. అలానే సంక్షేమం పొందని వారికి పథకాలను అందించేందుకు వెసులుబాటు లభించిందన్నారు. ఎలాంటి ప్రతిఫలం ఆశించకుండా అవినీతికి పాల్పడకుండా స్వచ్ఛందంగా సేవలందిస్తున్న వలంటీర్లను చూసి కొందరు ఈర్ష్యతో వారిపై లేనిపోని అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారన్నారు. వలంటీర్లే లేకపోతే జగనన్న సురక్ష ఇంతటి విజయాన్ని సాధించేది కాదని స్పష్టం చేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వలంటీర్లకు, సచివాలయ వ్యవస్థకు ఎప్పటికి అండగా ఉంటుందని, వారే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సైన్యం అని అభిప్రాయపడ్డారు. వలంటీర్లను కించపరిచేలా మాట్లాడితే 2024 ఎన్నికల్లో డిపాజిట్‌లు కూడా రావని హెచ్చరించారు. సర్వశిక్ష అభియాన్ ఏపీడీ ప్రభాకర్‌రెడ్డి, రాష్ట్ర గిడ్డంగుల శాఖ కార్పొరేషన్ డైరెక్టర్ ఆకేపాటి వేణుగోపాల్‌రెడ్డి, ఇరగంరెడ్డి సుబ్బారెడ్డి, గజ్జల శ్రీనివాసులరెడ్డి, దుద్యూతల రఘురాంరెడ్డి, ఎంపీటీసీ ఎం.నారాయణరెడ్డి, కోఆప్షన్ మెంబర్ ఎస్.ఎం. రఫీ, సర్పంచ్ ఎం.శివనారాయణ, మండల ప్రత్యేక అధికారి సురేష్ కుమార్, ఎంపీడీఓ రెడ్డయ్య, తహసీల్దార్ మాధవీలత, ఏఓ కిరణ్ కుమార్‌రెడ్డి, ఎంఈఓ వెంకటసుబ్బయ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

నవయుగ కవిచక్రవర్తి గుర్రం జాషువా



జాషువా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న సీఐటీయూ, డీవైఎఫ్ఐ నాయకులు

బద్వేలు అర్బన్ : నమ్మిన విలువల్ని, సిద్ధాంతాల్ని తన రచనల ద్వారా నిక్కచ్చిగా ప్రకటించిన నవయుగ కవిచక్రవర్తి గుర్రంజాషువా అని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాసులు, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఎం.చిన్ని పేర్కొన్నారు. జాషువా వర్ధంతిని పురస్కరించుకుని సోమవారం స్థానిక సుందరయ్య భవనం ఆవరణలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ జాతీయ ఉద్యమం కాలంలో భారతమాత గొప్పదనాన్ని చాటిచెప్పే అనేక విషయాలను తన కవిత్వంలో పొందుపరిచి ప్రజల్లో దేశభక్తిని నింపారని అన్నారు. నేటి యువత జాషువాను ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి కె.నాగేంద్రబాబు, డీవైఎఫ్ఐ మహిళా కన్వీనర్ దేవి, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు మస్తాన్, షరీఫ్, నాయకులు నాగార్జున, ఇమ్మానియేల్, మహిళా సంఘం నాయకురాలు అనంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

డీఈఓ వ్యవహారాలపై విచారణ జరపాలి

కడప సెవెన్‌రోడ్స్ : జిల్లా విద్యాశాఖాధికారి రాఘవరెడ్డి ఉపాధ్యాయులపై వ్యవహరిస్తున్న తీరు, పాల్పడుతున్న అక్రమాలపై విచారణ జరిపి చట్టపరమైన చర్యలు చేపట్టాలని ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి సోమవారం కలెక్టర్ విజయరామరాజును కోరారు. ఆదర్శంగా ఉండాల్సిన డీఈఓ టీచర్ల పట్ల అనుచితంగా, అవమానకర రీతిలో ప్రవర్తిస్తున్నారని ఆరోపించారు. డీఈఓ వ్యవహార్లాలపై విచారణ చేయిస్తామంటూ కలెక్టర్ హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్సీ తెలిపారు.

ఎమ్మెల్సీ క్షమాపణ చెప్పాలి

కడప ఎడ్యుకేషన్ : పశ్చిమ రాయలసీమ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి తనపై నిరాధారమైన, అర్థరహిత ఆరోపణలు చేశారని, దీనిని తీవ్రంగా ఖండిస్తున్నానని డీఈఓ రాఘవరెడ్డి అన్నారు. ఆయన వెంటనే బేషరతుగా క్షమాపణ చెప్పాలన్నారు.

రజకులకు రాజకీయ ప్రాధాన్యత కల్పించాలి

కడప రూరల్ : రజకులకు రాజకీయ ప్రాధాన్యత కల్పించాలని రజక సంఘాల సమైక్య జిల్లా అధ్యక్షులు యం మల్లయ్య తెలిపారు. సోమవారం స్థానిక ఆ సంఘం జిల్లా కార్యాలయంలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని రంగాల్లో రజకులు వెనుకబడి ఉన్నారని తెలిపారు. రాజకీయ ప్రాధాన్యత కల్పించినప్పుడే తమ వర్గీయుల ప్రగతి సాధ్యపడుతుందని అన్నారు. కార్యక్రమంలో కొండయ్య, శివ, సుబ్బరాయుడు, గంగయ్య, రమణ, కేఎన్ రెడ్డెయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు అభ్యుదయ సాహిత్య ఉపన్యాసం

కడప కల్చరల్ : స్థానిక సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో మంగళవారం అభ్యుదయ సాహిత్య ఉపన్యాసం నిర్వహించనున్నామని యోగి వేమన విశ్వవిద్యాలయం సభ్య కార్యదర్శి, కుల సచివులు ఆచార్య వైపీ వెంకటసుబ్బయ్య తెలిపారు. ఉదయం 10.00 గంటలకు బ్రౌన్ శాస్త్రి సమావేశ మందిరంలో ఈ కార్యక్రమం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమానికి పరీక్షల నియంత్రణ అధికారి ఆచార్య ఎస్.ఈశ్వర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరుకానున్నట్లు తెలిపారు. ప్రొద్దుటూరుకు చెందిన ప్రముఖ బాల సాహిత్య రచయిత డీకే చదువులబాబు విశిష్ట అతిథిగా, కథా రచయిత పాలగిరి విశ్వప్రసాద్ గౌరవ అతిథిగా హాజరు కానున్నట్లు వివరించారు. ఈ సదస్సులో వక్త వైఎస్సార్ జిల్లా అభ్యుదయ నవలా సాహిత్యం అనే అంశంపై ప్రసంగిస్తారని తెలిపారు.

ఆప్కాస్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని ధర్నా

కడప సెవెన్‌రోడ్స్ : కాంట్రాక్టు ఉద్యోగుల తరహాలోనే ఆప్కాస్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా జరిగింది. సీఐటీయూ నాయకులు మనోహర్ మాట్లాడుతూ ఆప్కాస్ ఉద్యోగులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్న సుప్రీం కోర్టు తీర్పును అమలు చేయాలన్నారు. సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని కోరారు. ఆప్కాస్‌ఉద్యోగుల కోర్కెల సాధనకు ఆగస్టు 14న ఛలో విజయవాడ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.వెంకటసుబ్బయ్య, ఎం.రవిప్రకాశ్, సుదర్శన్, బాలాజీరావు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణ పనుల పరిశీలన

కమలాపురం : మండల పరిధిలోని సంబటూరు గ్రామం నుంచి మొలకవారిపల్లె మధ్య నిర్మిస్తున్న రోడ్డు నిర్మాణ పనులను సోమవారం రాష్ట్ర ఉద్యాన సలహాదారుడు సంబటూరు ప్రసాద్‌రెడ్డి పరిశీలించారు. కమలాపురం సమీప గ్రామాల్లో గుంతలమయమైన రోడ్లను గమనించి ఎమ్మెల్యే రవీంద్రనాథరెడ్డి, ఎంపీ అవినాష్‌రెడ్డి సీఎం దృష్టికి తీసుకుని వెళ్లారని తెలిపారు. ఇటీవల కమలాపురం పర్యటనకు వచ్చిన సీఎం జగన్ మోహన్‌రెడ్డి సంబటూరు నుంచి కమలాపురం, ఖాజీపేట రోడ్డు వరకు 4.3 కిలోమీటర్ల రోడ్డు నిర్మాణానికి రూ.3. కోట్ల 28 లక్షలతో శంకుస్థాపన చేశారన్నారు. ప్రస్తుతం రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభమైనట్లు ఆయన చెప్పారు.

పిల్లలకు సరైన సౌకర్యాలను అందించాలి



మాట్లాడుతున్న జడ్జి ప్రదీప్‌కుమార్

కడప అర్బన్ : పిల్లలకు సరైన సౌకర్యాలను అందించాలని, వారి ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా వుండాలని జిల్లా న్యాయసేవాధికారసంస్థ సెక్రటరీ, జడ్జి ఎం. ప్రదీప్‌కుమార్ అన్నారు. సోమవారం జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జడ్జి తమ సిబ్బందితో కలిసి కడపలోని ప్రభుత్వ బాలుర గృహంను సందర్శించారు. అక్కడ పరిసరాలను, పిల్లలకు అందుతున్న సౌకర్యాలపై ఆరా తీశారు. రిజిస్టర్‌లను పరిశీలించారు. తరువాత న్యాయవిజ్ఞాన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ బాలల సంరక్షణ కోసం స్నేహపూర్వక న్యాయసేవలు పథకం 2015ను వివరించారు. పిల్లల పట్ల ఎప్పటికపుడు తగిన జాగ్రత్త తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ బాలుర వసతి గృహం సూపరింటెండెంట్ పాల్గొన్నారు.

సచివాలయ కార్యదర్శులపై దాడులను అరికట్టాలి



కార్పొరేషన్ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహిస్తున్న ఏపీఎన్‌జీవో, సచివాలయ ఉద్యోగుల సంఘం నాయకులు

కడప కార్పొరేషన్ : గ్రామ, వార్డు సచివాలయ కార్యదర్శులపై జరిగే దాడులను అరికట్టాలని ఏపీ ఎన్‌జీఓ జిల్లా అధ్యక్షుడు బి. శ్రీనివాసులు కోరారు. సోమవారం 13వ డివిజన్ ప్లానింగ్ సెక్రటరీ రామమోహన్‌పై దాడి చేయడాన్ని నిరసిస్తూ కార్పొరేషన్ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు. శ్రీనివాసులు మాట్లాడుతూ గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థను ముఖ్యమంత్రి ఎంతో ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేశారని, ప్రజలకు అన్ని రకాల సేవలను సచివాలయ వ్యవస్థ ద్వారా అందిస్తున్నారన్నారు. ప్రజా సేవలో విధులు నిర్వహించే క్రమంలో అక్రమంగా నిర్మిస్తున్న కట్టడాలను పై అధికారుల ఆదేశాలతో ఆపారనే కారణంతో దాడి చేయడం సరికాదన్నారు. దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్‌జీవో సంఘం జిల్లా కార్యదర్శి డి. రవికుమార్, నగర అధ్యక్షుడు కె. చిన్నయ్య, కార్యదర్శి శైలేశ్వర్‌రెడ్డి, నాగార్జునరావు, పద్మనాభరావు, గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు హీరామియా, కార్యదర్శి ప్రసాద్ పాల్గొన్నారు.

యూపీఎస్సీ విజేతకు అభినందన



ధర్మానాయక్‌ను అభినందిస్తున్న వీసీ, రిజిస్ట్రార్

వైవీయూ : యోగివేమన విశ్వవిద్యాలయం జర్నలిజం శాఖ పూర్వ విద్యార్థి బి. ధర్మానాయక్‌ను వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్, రిజిస్ట్రార్ ఆచార్య వై.పి. వెంకటసుబ్బయ్య అభినందించారు. ధర్మానాయక్ యూపీఎస్సీ నిర్వహించిన ఇండియన్ ఇన్ఫర్మేషన్ సర్వీస్, మినిస్ట్రీ ఆఫ్ ఇన్ఫర్మేషన్ అండ్ బ్రాడ్‌కాస్టింగ్ శాఖలో సీనియర్ గ్రేడ్ గెజిటెడ్ ఆఫీసర్ పోస్టుకు ఎంపికైన సందర్భంగా సోమవారం ఈయన్ను అభినందించారు. కార్యక్రమంలో జర్నలిజం శాఖాధిపతి డా. టి.శ్యామ్‌స్వరూప్, అధ్యాపకులు డా. టి.సురేష్‌బాబు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగులకు పెన్షన్ సౌకర్యం కల్పించాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఏపీఎస్ ఆర్టీసీలో పనిచేసి 2014కు ముందు రిటైర్డ్ అయిన ఉద్యోగులకు చాలీచాలని పెన్షన్ అందుతోందని, తమకు కూడా ప్రస్తుతం ఇస్తున్నట్లుగా పెన్షన్ సౌకర్యం కల్పించాలని వైఎస్సార్ ఆర్టీసీ ఎంప్లాయిస్ అసోసియేషన్ సెక్రటరీ ఎల్.రఘునాథరెడ్డి, వైస్ ప్రెసిడెంట్ రాజేంద్రప్రసాద్‌లు ఒక ప్రకటనలో కోరారు. 1.9.2014కు ముందు రిటైర్డ్ అయిన కార్మికులకు పెన్షన్ రూ. 800–2500 మధ్య వస్తోందన్నారు. ఈ మేరకు ఏపీ ఎస్ ఆర్టీసీ చైర్మన్‌కు, ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళుతున్నామన్నారు. ఈనెల 26వ తేది ఉదయం 10 గంటలకు కడప రీజినల్ మేనేజర్ కార్యాలయానికి చేరుకుని వారికి వినతిపత్రాన్ని సమర్పించి ఆ తర్వాత ఆర్టీసీ చైర్మన్ మల్లికార్జునరెడ్డికి విన్నవించనున్నామన్నారు. అందుకు రిటైర్డ్ కార్మికులందరూ కార్యక్రమానికి హాజరు కావాలన్నారు.

జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : జిల్లా ఉపాధి కల్పనాధికారి కార్యాలయ ఆధ్వర్యంలో జరుగుతున్న జాబ్‌మేళాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఉపాధి కల్పనాధికారి సురేష్‌కుమార్ తెలిపారు. సోమవారం తన కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 26న పెండ్లిమర్రి, వేంపల్లెలో ఉదయం 10.00 నుంచి సాయంత్రం 5.00 గంటల వరకు ఆయా ఎంపీడీఓ కార్యాలయాల్లో, 27న కలెక్టరేట్‌లోని జిల్లా ఉపాధి కల్పనాధికారి కార్యాలయంలో ఉదయం, మధ్యాహ్నం సీకే దిన్నె ఎంపీడీఓ కార్యాలయంలో జాబ్‌మేళా నిర్వహిస్తామన్నారు. కడప నగర శివార్లలోని కొప్పర్తిలో ఉన్న అల్ డిక్సన్ కంపెనీలో ఉద్యోగాల కోసం నిరుద్యోగ యువతకు అవకాశం కల్పిస్తున్నామన్నారు. ఆసక్తిగల మహిళా అభ్యర్థులు ఆయా ఎంపీడీఓ కార్యాలయాల్లో జరిగే ఇంటర్వ్యూలకు హాజరు కావాలన్నారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ, ఐటీఐ, డిప్లొమా ఉత్తీర్ణులైన వారు అర్హులన్నారు. ఇతర వివరాలకు 63059 92081, 95243 52809 నెంబర్లలో సంప్రదించాలన్నారు. ఈ అవకాశాన్ని జిల్లాలోని నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ప్రజా సంక్షేమమే జగనన్న ధ్యేయం



ప్రజలకు సర్టిఫికెట్లు అందిస్తున్న ఎమ్మెల్యే రవీంద్రనాథరెడ్డి

చింతకొమ్మదిన్నె : ప్రజా సంక్షేమమే జగనన్న ధ్యేయమని కమలాపురం ఎమ్మెల్యే పి. రవీంద్రనాథరెడి, సీకేదిన్నె జడ్పీటీసీ పి. నరేన్ రామాంజులు రెడ్డి అన్నారు.సోమవారం నగర కార్పొరేషన్ పరిధిలోని 45వ డివిజన్ ఉటుకూరు, మండలంలోని తాడిగొట్లలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలను చూసి ప్రతిపక్ష నేత చంద్రబాబు ప్రభుత్వంపై బురద చల్లే ప్రయత్న చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ పరిశ్రమల సలహాదారుడు రాజోలి వీరారెడ్డి, డిప్యూటీ మేయర్ బండి నిత్యానందరెడ్డి, 45వ డివిజన్ కార్పొరేటర్ గుత్తిరెడ్డి అంకమ్మ, మండల కన్వీనర్ గూడా ప్రభాకర్‌రెడ్డి, కో కన్వీనర్ కళా యాదవ్, మాజీ కన్వీనర్ గుత్తిరెడ్డి శ్రీనివాసులురెడ్డి, మండల ఉపాధ్యక్షుడు గజ్జల సుధాకర్‌రెడ్డి, ఈడిగ కార్పొరేషన్ డైరెక్టర్ కృష్ణయ్య, సర్పంచ్ సుబ్బరాయుడు, రాజశేఖర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో 50 కుటుంబాల చేరిక



పార్టీలో చేరిన కుటుంబాలతో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

ఎర్రగుంట్ల : మండల పరిధిలోని చిలంకూరు గ్రామానికి చెందిన 50 కుటుంబాలు సోమవారం జమ్మలమడుగు ఎమ్మెల్యే డాక్టర్ ఎం. సుధీర్‌రెడ్డి సమక్షంలో టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరారు. గ్రామంలోని ఐసీఎల్ గేటు వద్ద సమీపంలో నివాసం ఉండే నల్లమేకల శేఖర్‌రెడ్డి, నల్లమేకల కుమార్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, ముత్తరాసు శివ, ఎ.రాజశేఖర్, వి.పవన్‌కుమార్‌లతో పాటు మరో కొన్ని కుటుంబాలు చేరాయి. వైఎస్సార్‌సీపీలోకి చేరిన వారికి ఎమ్మెల్యే పార్టీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు.

కలెక్టర్‌ను సత్కరించిన ఆర్యవైశ్య సంఘం నాయకులు

బద్వేలు అర్బన్ : జిల్లా కలెక్టర్ వి.విజయరామరాజును సోమవారం కడపలోని జిల్లా కలెక్టర్ కార్యాలయంలో బద్వేలు ఆర్యవైశ్య వర్తక సంఘం నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. పట్టణంలోని మైదుకూరు రోడ్డులో గల ఆర్యవైశ్య శ్మశానవాటిక ఆవరణలో కన్యకాపరమేశ్వరీ షాపింగ్ మాల్ ఏర్పాటుకు సహకరించిన నేపథ్యంలో మర్యాదపూర్వకంగా కలిసి వెంకటేశ్వరస్వామి ప్రతిమను అందజేసి సత్కరించారు. అలాగే ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ రాహుల్‌మీనాను కూడా కలిసి సత్కరించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య వర్తక సంఘం అధ్యక్షులు కె.వి.సుబ్బారావు, గౌరవాధ్యక్షులు, మున్సిపల్ వైస్‌చైర్మన్ ఆర్.వి.సాయిక్రిష్ణ, ఉపాధ్యక్షులు మునగాచలమయ్య, సెక్రటరీ కొలిశెట్టినాగరాజ, జాయింట్ సెక్రటరీ నగళాసురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అయ్యంకి జయంతి

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక రామేశ్వరంలోని బాలబాలికల గ్రంథాలయంలో సోమవారం గ్రంథాలయోద్యమ పితామహుడు అయ్యంకి వెంకటరమణయ్య జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పుట్టపర్తి సాహితీ పీఠం కార్యదర్శి జింకా సుబ్రహ్మణ్యం, విశ్రాంత తెలుగు పండితులు వి.మునిభాస్కర్ రాజు పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ రికార్డు అసిస్టెంట్ ఇబ్రాం సాహెబ్, విశ్రాంత వైమానికదళ అసిస్టెంట్ ఇంజనీర్ వెంకటకొండయ్య, శ్రీనివాసుల రెడ్డి, స్వాతి, విద్యార్థులు పాల్గొన్నారు.